క్లుప్తంగా

విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ


వేసవి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ: వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులు అన్ని అంశాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని సీతంపేట ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయ నిర్వాహకుడు రాజు అన్నారు. గ్రంథాలయంలో బుధవారం ఏడవ రోజు సమ్మర్ క్యాంప్ ఉత్సాహంగా జరిగింది. కథలు చెప్పడం, చదివించడం, తెలుగు పద్యాలు, ఇంగ్లిష్ గ్రామర్, వేదిక్ మ్యాథమెటిక్స్, చిత్రలేఖనం తదితర అంశాలపై తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ తులసి, నాగ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


లలిత్‌ను అభినందిస్తున్న ఎస్పీ జగదీష్

ప్రకాశం నగర్: స్కేటింగ్‌లో కొండి లలిత్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆకాంక్షించారు. లలిత్ ఇటీవల గోవాలో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో రింక్ 5 రోడ్డు రేస్‌లో బంగారు పతకం, రింక్ 6లో రజత పతకం సాధించాడు. ఈ మేరకు బాలుడిని బుధవారం తన కార్యాలయంలో ఎస్పీ అభినందించారు. కోచ్ కె.నాగబాబు లలిత్ తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి


కరకుదురులో రికార్డులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామ పంచాయతీల పరిధిలో పన్నులు వసూలును వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. కరకుదురు, పెదపూడి సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పలు రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో జరిగే పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. పారిశుధ్యం, సురక్షిత తాగునీరు, వీధి దీపాలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, బి.ప్రసన్నకుమార్, తరుణ్ పాల్గొన్నారు.

287 మందికి వైద్యసేవలు


సింగవరంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: సింగవరంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు 287 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. గ్రామంలో ఇళ్ల వద్ద మంచంపై ఉన్న రోగుల వద్దకు నేరుగా వెళ్లి సేవలు అందించారు.

సినిమాలు

శ్యామల	ఆ ఒక్కటీ అడక్కు
సూర్యమినీ	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్, ప్రతినిధి - 2
సూర్యప్యాలెస్	అపరిచితుడు
స్వామి	కృష్ణమ్మ
శివజ్యోతి	గీతాంజలి మళ్ళీవచ్చింది, అక్కడ వారు ఇక్కడ ఉన్నారు
అనుశ్రీ	ది గ్యారీఫీల్డ్ మూవీ
రాజా	రత్నం
ఊర్వశి	బాక్
రంభ	మిరల్
మేనక	నవరత్నాలు, ప్రసన్నవదనం
అప్సర	కింగ్‌డమ్ ఆఫ్ దప్లానెట్ ఆఫ్ దిఏప్స్
కుమారి	ఆది
నామవరం	
వీఎస్ మహల్	కృష్ణమ్మ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	అపరిచితుడు, కింగ్‌డమ్ ఆఫ్ దప్లానెట్ ఆఫ్ దిఏప్స్

విజ్ఞానం.. వినోదం..

- ఆకట్టుకుంటున్న కాటన్ మ్యూజియం
- పెరుగుతున్న సందర్శకులు


ధవళేశ్వరంలోని కాటన్ మ్యూజియం

ధవళేశ్వరం: వేసవి సెలవులు అంటే చిన్నారులకు ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. ఏడాది పాటు పాఠశాలల్లో చదువులతో కుస్తీలు పట్టిన వారందరికీ ఉపశమనం లభిస్తుంది. అమ్మమ్మ ఇంటికో, బంధువుల ఊళ్లకో, నచ్చిన ప్రదేశాలకు వెళ్లడానికి ఇష్టపడతారు. వారికి ఆటపాటలతో పాటు విజ్ఞానాన్ని కలిగించే విషయాలను తెలియజేయడానికి ఈ సెలవులు బాగా ఉపయోగపడతాయి. అలాంటి వాటిలో కాటన్ మ్యూజియం ముందు వరుసలో నిలుస్తుంది. కాటన్ బ్యారేజీ గురించి పుస్తకాలలో చదువుకున్న విద్యార్థులందరూ దాన్ని కళ్లారా చూడడం చాలా బాగుంటుంది. బ్యారేజీ కట్టే సమయానికి ఉన్న పరిస్థితులను కాటన్ మ్యూజియంలోని చిత్రాలలో చూడవచ్చు. ఆనాటి ఆనకట్ట నిర్మాణంలో వాడిన పరికరాలు కూడా కనిపిస్తాయి.

కాటన్ మ్యూజియం

వేసవి సెలవులను ప్రస్తుతం విద్యార్థులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి బంధువులతో కలిసి ధవళేశ్వరంలోని కాటన్ మ్యూజియాన్ని సందర్శిస్తున్నారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలతో పాటు దూర ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో కాటన్ మ్యూజియం సందర్శకులతో కిటకిటలాడుతోంది. గోదావరి సోయగాల నడుమ నిర్మించిన ఈ మ్యూజియం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. కాటన్ దొర జీవిత విశేషాలతో పాటు గోదావరి పుట్టుక నుంచి సముద్రంలోకి కలిసే వరకూ ప్రవాహ తీరును ఇక్కడ చూడవచ్చు.

విజ్ఞాన వరప్రదాయిని

కాటన్ మ్యూజియాన్ని విజ్ఞాన వరప్రదాయినిగా చెప్పవచ్చు. దీని ఆవరణలో గోదావరి పుట్టిన నాసిక్ నుంచి సముద్రంలో కలిసి పోయే వరకూ ప్రవాహ నమూనాను ఏర్పాటు చేశారు. గోదావరిలో ఉప నదులు ఎక్కడ కలుస్తాయి, నది పక్కనే ఉండే దేవాలయాలను కూడా దీనిలో చూడవచ్చు. మ్యూజియం లోపల డెల్టా నమూనాలతో పాటు కాటన్ జీవిత చరిత్రను సమగ్రంగా అందుబాటులో ఉంచారు.

ఫొటో గ్యాలరీ

ధవళేశ్వరంలో ఆనకట్ట నిర్మాణానికి ముందు ఈ ప్రాంత ప్రజలు పడిన ఇబ్బందులను కళ్లకు కట్టినట్టు చూపించే ఫొటోలతో గ్యాలరీ ఏర్పాటు చేశారు. 1986 వరదలలో ఈ ప్రాంత పరిస్థితిని వివరించే ఫొటోలు కూడా ఇక్కడ ఉన్నాయి. మ్యూజియానికి మరోవైపు ఆనకట్ట నిర్మాణ సమయంలో ఉపయోగించిన పరికరాలను ఉంచారు. వాటి పేర్లను, వాటిని అప్పట్లో దేని కోసం వినియోగించారో ఆ వివరాలను పొందుపరిచారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన పార్కు ఎంతో ఆహ్లాదం కలిగిస్తోంది.


గోదావరి ప్రవాహాన్ని తెలిపే నమూనా చిత్రం


ఆనకట్ట నిర్మాణ పనులకు వినియోగించిన ఆవిరి యంత్రం

ప్రవేశ రుసుం రూ.10

కాటన్ మ్యూజియం చూసేందుకు పిల్లలకు రూ.5, పెద్దలకు రూ.10 వసూలు చేస్తున్నారు. మ్యూజియం బయట పార్కు అందాలను బంధించేందుకు కెమెరాకు రూ.25 వసూలు చేస్తున్నారు. మ్యూజియం లోపల ఫొటోలు తీసేందుకు అధికారుల అనుమతి తీసుకోవాలి. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకూ తెరిచి ఉంచుతారు. ఏడాది పొడవునా మ్యూజియం తెరిచే ఉంటుంది.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శ్యామ్యూల్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ కొంతమూరు గ్రామంలోని నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లిం పేట, అంబేడ్కర్‌పేట, అఫీషియల్స్ కాలనీ, పంచాయతీ ప్రాంతం, కాతేరు రోడ్డు, బ్రాహ్మణ అగ్రహారం, బేసమ్మ కాలనీ, శ్రీరామ్ నగర్, ఎంప్లాయీస్ కాలనీ, కలెక్ట్స్ నగర్, ఆదర్శ్ నగర్, జంగాల కాలనీ, బీసీ కాలనీ, శేషాద్రి లే అవుట్, క్వారీ ఏరియా, వీవీ కొండయ్య నగర్, ఫోర్త్ బ్రిడ్జి, కాతేరు గ్రామంలోని బ్రాహ్మణ అగ్రహారం ప్రాంతాలలో ప్రభావం ఉంటుందన్నారు.

- ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ కొంతమూరులోని ఎస్ఎస్ఆర్ లేఅవుట్, సున్నంబట్టి రోడ్, రాజరాజేశ్వరి నగర్, నూకాలమ్మ ఆలయ ప్రాంతం, మెయిన్ రోడ్, అఫీషియల్ కాలనీ, చందన రమేష్ లే అవుట్, చెంచు కాలనీ, విడో కాలనీ, తేజా నగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నిడదవోలుకు హిందూ ధర్మ పరిరక్షణ పాదయాత్ర

నిడదవోలు: హిందూ ధర్మ పరిరక్షణకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పాదయాత్ర చేపట్టిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త శివ కరణ్ సింగ్ బుధవారం నిడదవోలు చేరుకున్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. నీలం రామారావు, వేదుల జనార్దనరావు, శ్రీకాకుళం పురుషోత్తం, గమిని వెంకటరత్నం, మెట్టుపల్లి సుబ్బారాయుడు, ఎస్. రామారావు, మల్లెల కృష్ణమూర్తి, వలివేటి వెంకట సుబ్బారావు, రాజోలు బాలసుబ్రహ్మణ్య శర్మ, నిడుమర్తి భాస్కరరావు, శాంతిలాల్ జైన్, జగదీష్ జైన్, ఆకుల సత్తిబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ


దుళ్లలో పోలేరమ్మ జాతర సందర్భంగా ఆలయం వద్ద జరుగుతున్న గరగ నృత్యం

- ఘనంగా గ్రామదేవతల జాతరలు
- నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ప్రతి ఏటా వైశాఖ మాసంలో గ్రామ దేవతల జాతర, తీర్థ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. వీరవరం రోడ్డులోని వెదుళ్లమ్మ – దోసాలమ్మ, దామిరెడ్డిపల్లి పోలేరమ్మ, కడియపులంక పల్లాలమ్మ, దుళ్ల, మాధవరాయుడుపాలెం తదితర గ్రామాల్లోని పోలేరమ్మ ఉత్సవాలు వరుసగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా గరగ నృత్యాల ప్రదర్శనతో పాటు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా కాల్పుల మధ్య ఆర్భాటంగా జరిగేవి. అయితే ఈసారి సార్వత్రిక ఎన్నికల కారణంగా పోలీసుయాక్ట్ 30, 144 సెక్షన్‌లు అమలులో ఉన్నాయి. జూన్ 4వ తేదీ వరకూ ఈ నిబంధనలు కొనసాగనున్న నేపథ్యంలో ఉత్సవాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని పోలీసు శాఖ తెలిపింది. దీంతో ఉత్సవాలు గరగ నృత్యాల ప్రదర్శనలకే పరిమితమయ్యాయి. పోలీసుల పర్యవేక్షణలో సంప్రదాయబద్ధంగా ఉత్సవాలను ఆయా ఆలయ కమిటీలు, గ్రామస్తుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా దుళ్ల పోలేరమ్మ జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు ఆకట్టుకున్నాయి. పోలీసులు అనుమతించిన మేరకు నిర్ణీత సమయంలో ఉత్సవాలను ముగించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

- ఎస్పీ జగదీష్
- పుష్కరఘాట్‌లో మాబ్‌హ్యాండ్లింగ్, మాక్‌డ్రిల్ నిర్వహణ



పుష్కరఘాట్‌లో మాబ్ హ్యాండ్లింగ్, మాక్‌డ్రిల్‌లో ఫైరింగ్ చేస్తున్న పోలీసు సిబ్బంది

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ పి.జగదీష్ హెచ్చరించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ జిల్లాలో శాంతిభద్రతలను పర్యవేక్షించడమే ముఖ్య ధ్యేయంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్.ఆర్.రాజశేఖర్‌రాజు, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, సౌత్‌జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలు సంయుక్తంగా స్థానిక పుష్కర్ ఘాట్ వద్ద 'మాబ్ హ్యాండ్లింగ్, మాక్ డ్రిల్' నిర్వహించారు. అనుకోకుండా ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు, హింసాత్మక చర్యలకు పాల్పడినా, ఎవరైనా అల్లర్లు సృష్టించినా ఎలా స్పందించాలో ప్రదర్శించారు. మాబ్‌ను కంట్రోల్ చేయడానికి మొదటగా వార్నింగ్ ఇవ్వడం, అది వినకపోతే మేజిస్ట్రేట్ అనుమతితో టియర్ గ్యాస్ ప్రయోగించడం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీచార్జి చేయడం, ఆ తర్వాత ఫైర్ ఇంజన్లతో వాటర్ ప్రయోగించడం, ప్లాస్టిక్ బుల్లెట్ల ఫైరింగ్, అప్పటికి పరిస్థితి అదుపులోకి రాకుంటే ఫైరింగ్ వంటివి డెమో ద్వారా ప్రదర్శించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేలా జిల్లా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని చెప్పారు. అడిషనల్ ఎస్పీలు, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో కుక్కల భయం

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన రైల్వే స్టేషన్‌లో కుక్కల బెడద ఎక్కువైంది. దీంతో రైల్వే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం వేల మంది రాకపోకలు సాగించే రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్లో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. స్టేషన్ ముఖ ద్వారం, టిక్కెట్ కౌంటర్, ప్లాట్‌ఫామ్‌లపై విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. అక్కడ ఉంటున్న ప్రయాణికులను భయపెడుతున్నాయి. ముఖ్యంగా టిక్కెట్ కొనుగోలు చేసేందుకు కౌంటర్ వద్ద వెళితే అక్కడ అడ్డంగా తిష్ట వేస్తున్నాయి. వాటి భయపడుతూ టిక్కెట్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. చర్యలు చేపట్టాల్సిన రైల్వే అధికారులు చోద్యం చూడడంతో ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పట్టుకుని స్టేషన్‌లో అడుగుపెడుతున్నారు. ఏ సమయంలో ఎటు నుంచి కుక్కలు దాడికి దిగుతాయోనని భయపడుతున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు రాకపోకలు సాగించే సమయంలో కుక్కలు దాడులకు దిగడంతో రైల్వే అధికారులు నిర్లక్ష్యంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


రైల్వే స్టేషన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద తిష్టవేసిన కుక్కలు

లోగ్రేడ్ పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోండి

- బోర్డు అధికారులకు రైతుల విజ్ఞప్తి
- ఆర్‌ఎం ఆదిశేషయ్యతో దేవరపల్లిలో భేటీ

దేవరపల్లి: లోగ్రేడ్ పొగాకు కొనుగోలుకు కంపెనీలు ముందుకు రావడం లేదని, దాదాపు 20 రోజులుగా ఐదు వేలం కేంద్రాల్లో లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లు నిలిచిపోయాయని ఐదు వేలం కేంద్రాల రైతు సంఘాల ప్రతినిధులు బోర్డు అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లపై బుధవారం దేవరపల్లి వేలం కేంద్రంలో ఐదు వేలం కేంద్రాల రైతు సంఘాల ప్రతినిధులతో పొగాకు బోర్డు రీజినల్ మేనేజరు ఎం.ఆదిశేషయ్య సమావేశమై చర్చించారు. బ్రైట్ గ్రేడ్, మీడియం గ్రేడ్‌ల పొగాకు కొనుగోళ్లు బాగున్నప్పటికీ లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లు జరగడం లేదని రైతులు వివరించారు. ఈ ఏడాది 20 శాతం లో గ్రేడ్ పొగాకు పండినట్లు వారు తెలిపారు. మార్చి 6న పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కాగా నెల రోజులు లో గ్రేడ్ పొగాకు అమ్మకాలు జరిగాయన్నారు. అనంతరం బ్రైట్, మీడియం గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయడం వల్ల లోగ్రేడ్ పొగాకు నిల్వ ఉండిపోయిందని రైతు సంఘాల ప్రతినిధులు వివరించారు. బ్రైట్ గ్రేడ్ పొగాకుతో పాటు లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేయాలని రైతులు ఆర్‌ఎం ఆదిశేషయ్యను కోరారు. పొగాకు మార్కెట్ పట్ల రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు.

28న కొయ్యలగూడెంలో ఇరు వర్గాలతో భేటీ

పొగాకు రైతులు చెప్పింది సావధానంగా విన్న బోర్డు రీజినల్ మేనేజరు ఆదిశేషయ్య వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ నెల 28న కొయ్యలగూడెం వేలం కేంద్రం వద్ద రైతు సంఘాల ప్రతినిధులు, ట్రేడర్లతో సమావేశం ఏర్పాటు చేసి లోగ్రేడ్ పొగాకు కొనుగోళ్లపై చర్చలు జరుపుతామన్నారు. ఈ రకం పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పొగాకు మార్కెట్‌పై ఆయన చర్చించారు. మార్కెట్లో ధర బాగున్నందున రైతులు అమ్మకాలను వేగవంతం చేయాలని సూచించారు. ఎన్ఎల్ఎస్ మార్కెట్లో రైతులకు కిలో రూ.292 లభిస్తోందని, గరిష్ట ధర కిలో రూ.332 లభిస్తోందన్నారు. ఇప్పటి వరకూ ఐదు వేలం కేంద్రాల్లో 18.51 మిలియన్ల కిలోల పొగాకు కొనుగోలు చేసినట్టు ఆర్‌ఎం చెప్పారు. ఈ సమావేశంలో దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం-1, 2 వేలం కేంద్రాల రైతు సంఘాల అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్, విల్లూరి రాంబాబు, కాకర్ల నందియ్య, పరిమి రాంబాబు, సత్రం వెంకట్రావు, వేలం కేంద్రం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.


రైతు సంఘాల ప్రతినిధులతో చర్చిస్తున్న రీజినల్ మేనేజరు ఆదిశేషయ్య

దివికేగిన దిగ్గజం

- కృష్ణబాబు మృతదేహానికి అంతిమ వీడ్కోలు
- శ్రద్ధాంజలి ఘటించిన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, పారిశ్రామికవేత్తలు, అభిమానులు


దొమ్మేరులో కృష్ణబాబు భౌతిక కాయానికి నివాళి అర్పిస్తున్న హోం మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే బాబాజీ రావు తదితరులు


కృష్ణబాబు మృతదేహానికి కుటుంబ సభ్యుల అంతిమ సంస్కారం


నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వెంకట్రావు, శ్రీనివాస్ నాయుడు, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ

కొవ్వూరు: మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) అంత్యక్రియలు బుధవారం మండలంలోని దొమ్మేరు గ్రామంలో అశ్రునయనాల మధ్య అభిమానులు, బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించారు. ఐదు సార్లు కొవ్వూరు ఎమ్మెల్యే పని చేసిన ఆయన ఈ ప్రాంత వాసుల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు. నియోజకవర్గ ప్రజలతోనే గాకుండా, పరిసర ప్రాంత వాసుల హృదయాల్లో చిరస్మరణీయుడిగా పేరుగాంచారు. నాలుగు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో అవినీతి మరక లేకుండా ప్రజలకు సేవలు అందించారు. మచ్చ లేని నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. తనను నమ్ముకున్న ప్రజలకు సేవ చేయడంమే లక్ష్యంగా కృష్ణబాబు పని చేశారు. ప్రాంతాలు వేరైనా, పార్టీలు వేరైనా ఎందరో నాయకులు ఆయనతో స్నేహభావంతో మెలిగే వారు. కృష్ణబాబు మరణ వార్త తెలయగానే రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ప్రముఖులు ఆయన అంతిమ సంస్కారాలకు హాజరు కావడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. సౌమ్యుడు, మృదు స్వభావిగా పేరు తెచ్చుకున్న కృష్ణబాబు తన రాజకీయ జీవితంలో ఏనాడూ వెనకడుగు వేయలేదు. ఎన్టీ రామారావుపై అభిమానంతో టీడీపీతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆయన 1983 నుంచి నాలుగు సార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో మరోసారి ఎమ్మెల్యే గెలిచి, కొవ్వూరు నియోజకవర్గం ఏర్పడ్డాక అత్యధిక పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన రికార్డును సొంతం చేసుకున్నారు. పార్టీలకు అతీతంగా కృష్ణబాబుకు ఈ ప్రాంతంలో అభిమానులు ఉన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది నాయకులు దొమ్మేరు తరలి వచ్చి ఆయన భౌతిక కాయంపై పూలమాలలు వేసి అంతిమ వీడ్కోలు పలికారు. తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన చింతకాయల అయ్యన్నపాత్రుడు, నెల్లూరుకు చెందిన ఆనం రామ నారాయణరెడ్డి, నన్నపనేని రాజకుమారి, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, వడ్డే శోభనాద్రీశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్లు ముళ్లపూడి బాపిరాజు, ఇమ్మణ్ణి రాజేశ్వరి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జి. శ్రీనివాస్ నాయుడు, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కృష్ణబాబు భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అలాగే ఆరోగ్యం బాగా లేకపోయినప్పటికీ మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు వీల్ చైర్‌లో దొమ్మేరు వచ్చి కృష్ణబాబు మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యేగా రెండు సార్లు అవకాశం కల్పించిన కృష్ణబాబుకు జీవితంలో ఎప్పటికీ మరిచి పోలేనన్నారు.ఆయనను తన రాజకీయ గురువుగా భావించే వాడినన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, టీవీ రామారావు, ఆరిమిల్లి రాధాకృష్ణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, దేవి సీ ఫుడ్స్ జేఎండీ పోట్రు బ్రహ్మానందం, శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, నవ భారత్ ఇండస్ట్రీస్ ఎండీ బోళ్ల రాజీవ్, ఆంధ్ర షుగర్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి, జేఎండీలు పెండ్యాల అచ్చిబాబు, ముళ్లపూడి నరేంద్రనాథ్, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, నాయకులు గారపాటి శ్రీనివాసరావు, ఉప్పులూరి సూరి బాబు, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, ముదునూరి నాగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వివిధ పార్టీల నాయకులు, పలువురు పారిశ్రామిక వేత్తలు, నాయకులు కృష్ణబాబుకు తుది వీడ్కోలు పలికారు.

మండుతున్న ఎండలు

రాజానగరం: వేసవి ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఆకాశంలో అడపాదడపా కారుమబ్బులు వేస్తున్నా, వాటి ప్రభావం పెద్దగా ఉండడం లేదు. ఈ నేపథ్యంలో జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నెలాఖరు నాటికి నైరుతి రుతుపవనాలు వస్తాయనే కబురుతో వారి రాక కోసం ఎదురు చూస్తున్నారు. వేసవి అంటేనే ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అయితే ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ పూర్తయి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్న రకరకాల ఊహాగానాలతో తలమునకలై ఉన్న జనావళికి వేసవి ఎండలు చుర్రుమంటున్నాయి.

ఎండలకు హడలిపోతున్న ప్రజలు


మండుతున్న ఎండల కారణంగా ఇంటి నుంచి బయటకు రావడానికి ప్రజలు హడలిపోతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. దాదాపు 40 డిగ్రీలు పైబడుతున్న ఉష్ణోగ్రతలు చినుకులు పడితే గానీ చల్లబడే పరిస్థితులు కానరావడం లేదు. ఈ నెల మొదటి వారంలో భారీగా వర్షం కురిసినా ఉష్ణోగ్రతలు ఏమాత్రం తగ్గలేదు. బుధవారం మధ్యాహ్నం 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. జాతీయ రహదారిపై ఆ సమయంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఆర్టీసీ బస్సులు మినహా లారీలు, ఆటోలు కూడా పెద్దగా తిరగలేదు. రాజానగరం, దివాన్ చెరువు, లాలాచెరువు కూడళ్ల జనసంచారం లేక నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

జాగ్రత్తలు అవసరం

ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో వడగాల్పులు వీచే అవకాశం అధికంగానే ఉందని వైద్యులు చెబుతున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల సమయంలో బయట తిరగవద్దని హెచ్చరిస్తున్నారు. చమటలు పట్టి శరీరం డీహైడ్రేషన్‌కి గురికాకుండా తరచూ మంచినీరు, గ్లూకోజ్ వాటర్, బార్లీ నీరు తాగుతుండాలని సూచించారు. అలాగే నీరసమనిపిస్తే ఓఆర్ఎస్ తీసుకోవడం మంచిదన్నారు.

శీతల పానీయాలకు డిమాండ్

ఎండల తీవ్రతకు కొబ్బరి బొండాలతో పాటు జ్యూస్, కూల్ డ్రింక్స్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాలలో సైతం జ్యూస్, కూల్‌డ్రింక్స్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కూడళ్లలో కొబ్బరి బొండాలు అమ్మకాలు జరుగుతున్నాయి.


రాజానగరంలో బుధవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి